స్మృతి

# వీణ పగిలిపోయింది ★

రచన : బులుసు ప్రకాశమ్మ

వీణ పగిలి పోయింది, అనుకోకుండా పగిలి పోయింది. పొద్దున్న లేచేటప్పటికి నిక్షేపంలా ఉండి, పగిలి పోయింది.

నేలని పడి ఉంది వీణ. అవయవాలు వేటికవిమూకగా కదలకుండా మెదలకుండా తీరూ తెన్నూ లేకుండా గుండెలు ముక్కలుచేస్తూ నేలనిపడి ఉన్నాయి.

'అయ్యో' అన్నాను. అంతే కూచోపడ్డాను వీణ దగ్గర. చూస్తున్నాను. వీణవేపు నిలువుగుడ్లతో.

కేక విన్నారు అంతా. పోగయ్యారు వీణ చుట్టూ. చూశారు వీణవేపు - నావేపు. కళ్లల్లో నీళ్లు తిరిగాయి అందరికీ. 'పాపం, చక్కటి వీణ పగిలిపోయింది, అన్నారు. వెళ్ళిపోయారు.

వీణ మా ఇంటికొచ్చి అయిదేళ్లయింది.

ఎంతకాలంనుంచో ఆశపడ్డాను. మనకో వీణుంటే బాగుండునని వచ్చింది. తాకితే మాసిపోతుందన్నట్టుండేది మెరుపుతో మిలమిల్లాడుతూ కలకల్లాడుతూ.

తీగెలు కొత్తవి. రంగు కొత్త. పచ్చారలేదింకా. శ్రుతులు సరిగ్గా కూడనే లేదు. చిన్న-లేత-నాదం. ఎంత మధురం! ఆ నాదం! చూసుకునే మురిసిపోయేదాన్ని.

వీణకి మా ఇంట్లో పడకగదిలో చక్కటి స్టేజి ఏర్పాటు చేశాను. ఎన్ని తిప్పలు పడి అలంకరించానో ఆ స్టేజిని.

ఉదయం లేవడం, వీణని నెమ్మదిగా మెత్తటి గుడ్డతో తుడవడం, రెండుమూడు పూలు తల్లో పెట్టడం. మంచి పట్టుగుడ్డ ఎంబ్రాయిడరీ కుట్టినది కప్పడం, అదేపనిగా చూడడం, తియ్యటి కలలు కంటూ, ఇది నా నిత్యకృత్యంగా ఉండేది.

వీణ వుందని నాకు గర్వం. 'వీణ మా ఇంటి వెలుగు. వీణ ఉన్న మా ఇల్లు స్వర్గం. వీణ కలిగిన నేను స్త్రీలలో అగ్రగణ్యురాలిని' అనుకునే దాన్ని.

నా వీణ సరిగమలు పిల్లారి గీతాలు పాడుతూంటే 'దివ్యల గానం దీనిముందు దిగదుడుపు' అనిపించేది నాకు.

నాదం చాలా బాగుందన్నారంతా. ఆ సరిగమల్నే అఖండగీతంలా వినేవారు, ముఖమంతా చెవులతో. గర్వంగా ఉండేది నాకు.

వీణ నాతో అనేది. నేనూ చక్కటి కృతులు రాగాలూ పల్లవులు అన్నీ పాడతాను. అఖండ మన్నన లందుతాను. సాటిలేని మేటికీర్తి నార్జిస్తాను నీకు, కాలం రానీ.

నిజంగా అంది. ఒక కాళరాత్రి. ప్రకృతి తల విరగబోసుకుని ప్రళయతాండవం చేస్తోంది, కాలుడు మహావృక్షాలతో తాళం వేస్తున్నాడు. పంచభూతాలూ ఆనందంతో ఉప్పొంగి పోతున్నాయి. మేడలు మిద్దెలు భయంతో గజగజలాడాయి. కిటికీలు ద్వారాలు రెక్కలు కప్పాగున్నాయి.

నా వీణకి శాలువ ఒకటి కప్పాను. ఫరవా లేదులే అనుకున్నాను. 'భళేలు' మని ఓ పెద్ద కేక. గుండె అదిరిపోయింది. పరిగెత్తాను గదిలోకి.

ఏముంది! వీణ పగిలిపోయింది. నా ఆశలు కోరికలు తలంపులు ముక్కలు ముక్కలై పోయాయి.

నేను మిగిలాను.